పాస్టర్ ప్రవీణ్ పగడాలది హత్యే



మానవహారంగా ఏర్పడిన పాస్టర్‌లు

దర్శి: అంతర్జాతీయ క్రైస్తవ బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాలది హత్యేనని అనుమానంగా ఉందని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవ ప్రసాద్ అన్నారు. దర్శి రీజయన్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో దర్శి క్రిస్టియన్‌పాలెం నుంచి ఎంపీడీఓ ఆఫీస్, డీఎస్పీ కార్యాలయం మీదుగా గడియారం స్తంభం సెంటర్‌కు చేరుకున్నారు. నిజం నిగ్గు తేల్చాలని కోరుతూ పాస్టర్‌లు నినాదాలు చేశారు. గడియారం స్తంభం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి తమ నిరసన తెలిపారు. గాలిమూటి దేవప్రసాద్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతి చెందిన వ్యక్తి ఎంతో సౌమ్యుడని, సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా ఎందరికో ఉపాధి కల్పించారన్నారు. చారిటబుల్ ట్రస్ట్‌ల ద్వారా ఎంతో మందికి తన సహాయ సహకారాలు అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సంఘటన జరిగి ఐదు రోజులైనా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన హోంశాఖ మంత్రి సంఘటన స్థలానికి కానీ, పోస్టుమార్టం జరిగిన ఆస్పత్రికి గానీ ఇప్పటికీ వెళ్లి విషయాలు తెలుకోక పోవడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఈ కేసును నీరు గార్చాలని చూస్తోందన్నారు. దర్శి రీజనల్ పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ అధ్యక్షుడు గల్లెపోగు ఏసుదాసు మాట్లాడుతూ ప్రభుత్వం నిస్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. లేని పక్షంలో పాస్టర్‌లు అందరూ కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. దర్శి తెలుగు బాప్టిస్ట్ చర్చ్ సంఘ కాపరి సూర్యచంద్ర మాట్లాడుతూ పాస్టర్ మృతికి ఇంతవరకు కారణాలు తెలుకోక పోవడం బాధాకరమన్నారు. సంఘం మండల అధ్యక్షుడు బెజవాడ అనీల్‌కుమార్, కురిచేడు మండల పాస్టర్స్ ప్రెయర్ ఫశ్రీల్లోషిప్ అధ్యక్షుడు గండి సుందర్‌రావు, దొనకొండ మండల అధ్యక్షుడు గుడిమెట్ల యేషయా, తాళ్లూరు మండల సెక్రటరీ రవిచంద్ర, ముండ్లమూరు ప్రెసిడెంట్ పి.బాబన్న, దళిత సేన ప్రధాన కార్యదర్శి గర్నెపూడి ప్రేమ్‌కుమార్, దళిత నాయకులు గోవింద్ ప్రసాద్, గుంటు పోలయ్య, డగ్లస్, రాచపూడి కరుణానిధి, పాస్టర్‌లు జీఎస్ పాల్, డానియేల్ పాల్, నిరీక్షణ కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఇళ్ల వద్దే పింఛన్ వెరిఫికేషన్ చేయాలి

యర్రగొండపాలెం: ప్రభుత్వం చేపట్టిన దివ్యాంగుల పింఛన్ వెరిఫికేషన్ ప్రక్రియను వారి ఇళ్ల వద్దకే వెళ్లి చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య శుక్రవారం కోరారు. దివ్యాంగుల పింఛన్ వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని, వైద్య శాఖాధికారులతో పాటు గ్రామీణాభివృద్ధి అధికారులు నడవలేని దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీలు చేయాలని, రెండు కాళ్లు సచ్చుబడిన వారిని వైద్యశాలలకు రమ్మనడం సరైన పద్ధతి కాదని, శారీరక దివ్యాంగులు భగ భగమండే ఎండల్లో తారు రోడ్లపై దోగాడుకుంటూ వెళ్లేందుకు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పూర్తిగా నడవలేని దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి వెరిఫికేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఈకేవైసీ గడువు పెంచాలి

పుల్లలచెరువు: రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఈకేవైసీ వేసే గడువును పొడిగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివ్ సెక్రటరీ డి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈకేవైసీ గడువును ఈ 30వ తేదీ వరకు మాత్రమే గడువు పెట్టారని, గ్రామాల్లోని కొన్నిచోట్ల వేలిముద్రల యంత్రం పనిచేయక పోవడంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నందున సమయం సరిపోదన్నారు. కొన్ని గ్రామాల్లో సిబ్బంది అలసత్వంతో ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈకేవైసీ చేయించుకోకుంటే బియ్యం కట్ అని ప్రచారం చేస్తే నిరుపేదలకు భోజనం ఎవరు పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని గడువు పెంచాలని, ఈకేవైసీ నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా పబ్బిశెట్టి



నూతన కమిటీని అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

యర్రగొండపాలెం: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ఏర్పడింది. అధ్యక్షుడిగా పబ్బిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా పొట్టి బాల వెంకట సుబ్బారావు, కోశాధికారిగా వేముల నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వీరిని ఆ సంఘ నాయకులు కందూరి కాశీవిశ్వనాథ్, సూరె వెంకటప్రసాద్, గుర్రం కృష్ణమూర్తి, పరిమి శేఖర్, సూరె వెంకటస్వామి, గ్రంథి రమణారావు, మొగిలి సుబ్బారావు, గోళ్ల శ్రీరాములు, పబ్బిశెట్టి రవికుమార్, జోగిపర్తి సంతోష్ శాలువాలు కప్పి అభినందించారు.

తిరునాళ్లకు ప్రత్యేక పోలీసు బందోబస్తు



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీ నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూత కాటమరాజు స్వామి తిరునాళ్ల శనివారం జరగనున్న సందర్భంగా భద్రత ఏర్పాట్లను మార్కాపురం డీఎస్పీ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరునాళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఆలయం పరిసర ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో తిరునాళ్ల సందర్భంగా ముఖ్యంగా మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దొంగలను అరికట్టేందుకు పోలీసులతో పాటు మఫ్టీలో పోలీసులు పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులు ఎండలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏవరికైనా ఏదైనా సమస్యలు వస్తే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకర్, ఎస్‌ఐ అనిల్‌కుమార్, ఆలయం కమిటీ సభ్యులు ఉన్నారు.

రమణయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

దొనకొండ: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కొటికలపూడి రమణయ్య పంతులు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబాన్ని పోషించే ఆయన పెద్ద కుమారుడు గతంలో మరణించారు. విషయం తెలుసుకున్న దర్శి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ యజమానురాలు కొటికలపూడి పార్వతికి సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ కర్పూరం శ్రీనివాస రెడ్డి రూ.21 వేలు నగదు అందజేశారు. మానవతా సంస్థ వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. డి.వెంకటరెడ్డి, గొర్రెపాటి వేణు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే గూడేల అభివృద్ధి



గారపెంట గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతప్‌కుమార్

పుల్లలచెరువు: గిరిజనులంతా ఐక్యంగా ఉన్నప్పుడే గూడేలు అభివృద్ధి చెందుతాయని ఎస్‌ఐ సంతప్‌కుమార్ అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాలపై మండలంలోని గారపెంట గిరిజన గూడెంలో గురువారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గిరిజన పెద్దలతో, గూడెం వాసులతో ఎస్‌ఐ ముచ్చటించారు. ఆయన గిరిజనులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి నియమాలు తెలుసుకోవాలన్నారు. నూతన చట్టాల ప్రకారం భారీ మార్పులు, జరిమానాలు విధించే విధంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

వెలిగొండ ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తి చేయాలి

యర్రగొండపాలెం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తి చేసి పశ్చిమ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా రాష్ట్రం అప్పులపాలైందని, సీఎం చంద్రబాబునాయుడు ప్రజలను తప్పుదోవ పట్టించడం సరైన పద్ధతి కాదన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు కేటాయిస్తేనే పూర్తవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు, రాబోయే బడ్జెట్‌లో మరో రూ.2 వేల కోట్లు కేటాయించి ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గత బడ్జెట్‌లో ప్రాజెక్ట్‌కు రూ.309 కోట్లు కేటాయించి జిల్లా ప్రజలను అత్యంత దారుణంగా మోసం చేశారని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు ఇవ్వలేని చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టటానికి పోలవరం నుంచి బనకచర్ల పేరుతో రూ.84 వేల కోట్లతో గోదావరి, కృష్ణ, పెన్నా నదులను అనుసంధానం చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజల ఆకాంక్షలను, వారికిచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని భ్రమలో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ఏం చేస్తారో చెప్పకుండా 2047 నాటికి ఏదో చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. జిల్లా ఇతోధికంగా అభివృద్ధి కావాలన్నా, పశ్చిమ ప్రాంతం పురోభివృద్ధి చెందాలన్నా వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి కావడమే ఏకైక శరణ్యమన్నారు. ప్రాజెక్ట్ కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సమీక్షించి రూ.2 వేల కోట్లు కేటాయించి 2026 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, బాణాల రామయ్య, నక్కా తిరుపతయ్య, సాంబశివరావు, విశ్వరూపచారి, పి.తిరుమలయ్య, వై.వెంకటశివయ్య పాల్గొన్నారు.

పత్తిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి: పత్తి సాగు చేసే రైతుకు ఆ పంట లాభదాయకంగా మారాలంటే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.రాజమణి సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకంలో భాగంగా నాగపూర్ సౌజన్యంతో దొర్నాల పరిధిలోని గిరిజన రైతులకు పత్తి పంటపై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రాజమణి మాట్లాడుతూ సమగ్ర యాజమాన్య పద్ధతులైన పత్తిలో ఎకరానికి 20పైగా పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకుంటే పత్తి పంటలో 40 నుంచి 60 రోజులు పంట సమయంలో ఆశించే రసం పీల్చే పురుగుల ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. పూత, కాయ, పిందేల దశలో ఆశించే గులాబీ రంగు తెగులుకు ప్రధాన కారకమైన తల్లి పురుగులను అరికట్టాలన్నారు. అందుకు పిర మూన్ ట్రాప్స్ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పత్తి పంట చుట్టూ కంచె పంటలైన మొక్కజొన్న, జొన్న మొదలగు పంటలను ఏర్పాటు చేసుకుంటే మిత్ర పురుగులు తినేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. తల్లి పురుగులు పత్తిలో గుడ్లు పెట్టినప్పుడు ఆ గుడ్లు పిల్లలుగా రూపాంతరం చెందకుండా చేయాలంటే కచ్చితంగా వేప కషాయాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఒక మందును ఒక తెగులుకు పిచికారీ చేసినప్పుడు పది రోజులు సమయం ఉండాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ జి.రమేష్, డాక్టర్ ఎల్.రాజేష్ చౌదరి, డాక్టర్ టి.వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వంటకాలు అమోఘం.. బస సౌకర్యవంతం



గిద్దలూరు పట్టణ వ్యూ

బేస్తవారిపేట: గిద్దలూరులోని లాడ్జీలు అన్ని వసతులతో సౌకర్యవంతంగా ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు బస చేసేందుకు, వేచి ఉండేందుకు చక్కటి సదుపాయాలు కల్పిస్తున్నాయి. వ్యాపార పనులపై వచ్చేవారికి, యాత్రికులకు మెరుగైన సేవలు అందిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు తక్కువ ధరలోనే లాడ్జిలు అందుబాటులో ఉన్నాయి. లాడ్జిల్లో ఏసీ, నాన్ ఏసీ, డబుల్ బెడ్‌రూమ్‌లు, సింగిల్ బెడ్ రూమ్‌లు, ప్రత్యేక సూట్ రూములు, టీవీ, వైఫై సేవలు అందుబాటులో ఉన్నాయి. లాడ్జిల్లో బసచేసే వారికి ఆర్డర్లపై భోజన సదుపాయం కల్పిస్తున్నారు.

రెస్టారెంట్లలో నోరూరించే వంటకాలు

గిద్దలూరు నగర పంచాయతీలో కొత్త, పాత రెస్టారెంట్లలో నోరూరింటే వెజ్, నాన్‌వెజ్ వంటకాలు భోజన ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. మటన్ బిర్యానీ, చికెన్ దమ్ బిర్యానీ, ఎస్పీ బిర్యానీ, చికెన్ రోస్ట్ బిర్యానీ, మొఘలాయి బిర్యానీ ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. పార్టీలు, పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర వేడుకలకు ఆర్డర్లపై వంటలు తయారు చేస్తున్నారు. రాయలసీమ వంటకాలైన నాటుకోడి, తలకాయ కూర రుచికరంగా తయారు చేస్తున్నారు. కంజు బిర్యానీ, కంజు రోస్ట్, చిల్లి చికెన్, చికెన్ రోస్ట్, చికెన్-65 వంటి అనేక రకాలు వడ్డిస్తున్నారు. శిల్పా రెస్టారెంట్ తమ వినియోగదారులకు ఏడాదిపాటు బంపర్ ఆఫర్ ప్రకటించింది. రెండు బిర్యానీలు కొనుగోలు చేసిన వారికి ప్లేట్ స్టఫ్ ఉచితంగా అందిస్తోంది.